# కనువిప్పు

రచన: విశ్వాత్మల




అది అసలు పట్టణాల జాబితాలోకి రానే రాదు. అట్లని కుగ్రామంకూడా కాదు. మధ్యతరగతి పెద్దగ్రామం. షుమారు ఎనిమిది వేల జనాభా వుంటుంది. గ్రామానికి కావలసిన హంగులన్నీ వున్నాయి. పంచాయతీ ఎలక్షన్స్‌కూడా గొప్పగానే జరుగుతుంటాయి. ఆ చుట్టుప్రక్కల ఒకటి రెండు గ్రామాలకువెళ్ళాలంటే కారుమీద ఈగ్రామం మీదగానే ప్రయాణం చెయ్యాలి.

పల్లెటూరుకావడంతో పాడిపంటలు సమృద్ధిగానే వుంటాయి. కాని ఏం లాభం? అందరు పాలమీద వ్యాపారంచేసి డబ్బు గడించటం మొదలుపెట్టారు. ఊళ్ళోవాళ్ళకు పెరుగు అంతగా దొరకదు. అసలు పాలు తోడుపెడితేగా పెరుగు రావటానికి. పాలు దాదాపు మూడుపాళ్ళు యిటు బెజవాడకు రైళ్ళమీద కావళ్లతోను, అటు తెనాలికి బస్సుమీద పంపి డబ్బుచేసికొంటున్నారు.

ఇప్పుడు ప్రజలు పల్లెటూరులో వుంటున్నారని పేరుకేగాని కాలంగడిపేదంతా ఎక్కువుగా బస్తీలలోనే. పల్లెప్రజలకు బస్తీ వెళ్లి రావటమంటే మంచినీళ్లప్రాయం అయింది. మీకు తెలుసునో తెలియదో! ఎక్కువమంది కాఫీకి గూడూరునుండి మద్రాసువెళ్లి త్రాగి వస్తారట! ఏ క్రొత్తసినిమావచ్చినా పల్లెప్రజలంతా పట్టణం చేరుకోవలిసిందేగా! యిల్లు ఏమయిపోయినాసరే!

ఆ గ్రామంలో అన్నిరకాల వాతావరణం కనిపిస్తుంది. అన్నివృత్తులు అక్కడ సక్రమంగానే సాగుతుంటాయి. పల్లెటూరుకాబట్టి ఎక్కువగా పెద్ద పెద్ద యిండ్లు వుంటాయి. ఆ వూళ్ళో మెయిన్‌బజారు అంటూ వుంది కాని అట్టే పొడుగులేదు. ఉన్న బజార్లలో కల్లా పెద్దదదే. ఆ రోడ్డుకు అటు యిటు బారులుతీర్చి యిండ్లు వున్నాయి.

పాటిమీద పెద్దరావిచెట్టు వుంది. పెద్దలందరు ఎక్కువగా అక్కడ చేరుతుంటారు. లేకపోతే పంచాయతీఆఫీసు. మిగిలినవారికి వుండనేవున్నాయి ఆలయాలు. అన్నిరకాల సామగ్రి ఆ పాటిమీద దొరుకుతుంది.

ఆ మెయిన్‌బజారులోనే కుడిచేతిప్రక్క ఒక సందుదాటినతర్వాత పెద్ద డాబా ఒకటి వుంది. వీధివాకిలి మెయిన్‌రోడ్డుమీదనేవుంది. ఎక్కువుగా దొడ్డి యేమీ లేదు.

కోడికూసింది. తెలతెలవారుతోంది. నిద్ర మత్తులో కళ్ళు నలుపుకుంటూ లేచింది. ఒక్కసారి బద్ధకంగా వళ్ళువిరిచింది. పక్క చుట్టి మంచం యెత్తింది. మూలనున్న చీపురుకట్టపుచ్చుకొని ఎడంచేత్తో వీధివాకిలి తెరచింది. నడుమువంచి వీధిగుమ్మం చిమ్మి నీళ్ళుచల్లి ముగ్గుపెట్టింది. తర్వాత దొడ్లోకి వెళ్లింది కాలకృత్యాలు తీర్చుకోటానికి. పూర్తి అయ్యేసరికి బారెడు ప్రొద్దెక్కింది. పది గంటలయ్యేసరికి స్నానం ముగించుకొని తడి బట్టతో ఒక బిందెడు మడినీళ్ళు పంపులో నుండి పట్టితెచ్చి యింట్లో పెట్టింది.

కుంపటిరాజేసి అత్తెసరు పెట్టింది. ఎండాకాలము పలుచగా గొంతు దిగటంకోసం చింతపండు పిసికి రాచిప్పలో పోసింది పప్పుచారులోకి. పన్నెండు కొట్టేటప్పటికి కంచాలలో అన్నంపెట్టింది. ముసలితల్లి రంగమ్మ అప్పుడే మడిగట్టుకొచ్చి పీటమీదకూర్చుంది కూతురువడ్డించిన అన్నం తినటానికి. పాకాలు వస్తుతహా రుచిగా లేనప్పటికి కూతురు చేతి వంటగా అందుకని ఏమి అనలేక పెట్టింది పెట్టినట్లు ముద్దలు చేసి మ్రింగివేసింది. అక్కడనుండి యివతలపడి భుక్తాయాసంతో చెరొక మంచంమీద నడుం వాల్చారు.

లేచేసరికి సరిగా నాలుగు గంటలైంది. ముసలిరంగమ్మగారు చాపమీద కూర్చొని శివపురాణంలోని పద్యాలు కూడబల్కుకొని చదువుతోంది, జారిపోతున్న కండ్లజోడును సరిచేసుకొంటూ. లేచేసరికి పురాణకాలక్షేపం చెవులసోకింది. విసుగ్గా బయటికివచ్చేసింది కూతురు ఆమెకోసమే అన్నట్లు ఎదురు చూస్తోంది మూలనున్న చీపురు. అది అంది పుచ్చుకొని వీధిగుమ్మంవైపు బయలుదేరింది.

వీధిగుమ్మం తెరచుకొంది. ఒకచేతిలో చీపురు రెండవచేతిలో చీరకొంగు నడుమున దోపుతూ వాకిట్లో ప్రత్యక్షమైంది సంజకసువు చిమ్మటానికి. నడుముమీద చెయ్యిపెట్టుకొని వంగి కసువు చిమ్ముతోంది.

అప్పుడే ఆ మెయిన్‌రోడ్డులో ఎవరో ఇద్దరు వ్యక్తులు నడిచివెళ్లుతున్నారు. మొదటివ్యక్తి రెండవ వ్యక్తిని ఉద్దేశించి "ఎవరావిడ?"

"ఎవరావిడో నాకేం తెలుసు. "ఆ యింటి యజమాని" అని ముక్తసరిగా జవాబిచ్చాడు, ఆ రెండవ వ్యక్తి.

"ఆవిడ పేరు?"

"పేరుతో నీకేం పనో?" అని ఎదురు ప్రశ్న వేశాడు.

"అది కాదయ్యా బాబు! తెలిసికొందామని."

"తెలిసికొని ఏం చేస్తావంట అసలు" అని కాస్త చాదస్తుడిలా అడిగాడు.

"ఆ ఏంచేస్తానా? బంగారమైతే కొరుక్కు తింటా" అని వెకిలిగా అన్నాడు.

"నువ్వు కొరుక్కు తింటానికి బంగారమేమి మిగలలేదులే అంతా అయిపోయింది" అని బంగారంమీద దీర్ఘంతీశాడు.

అప్పటికి వారు రావిచెట్టుసమీపం చేరారు. అక్కడ ఎవ్వరులేరు. ఖాళీగా జనశూన్యంగా వుంది. చిన్నబండమీద చెరొకపిరుదు ఆనించి కూర్చున్నారు యిరుక్కొని.

ఆ మొదటివ్యక్తికి ఇంకా ఆలోచనలే తిరుగుతున్నాయి. వదిలిపెట్టలేక మళ్లీ ప్రశ్నిం

చాడు. "ఆవిడ పేరేమిటి?" కాస్త విప్పారిన ముఖంతో ఏ గుణానవున్నాడో కాని వెంటనే రెండవ వ్యక్తి జవాబు చెప్పాడు. "భారతమ్మ" అని.

"ఈవిడకి బాగా భాగ్యంవున్నది కదూ?"

"చాలావరకు నిజం. కాని భాగ్యంవున్నది కాదు. ఉండేది.

"అంటే యిప్పుడు లేదనేనా నీ వ్యాఖ్య"

"వేరే చెప్పాలా!"

"అయితే అభాగ్యం అంతా ఏమయింది?"

"హారతి కర్పూరంలాగా హరించుకొని పోయింది."

"కారణం?"

స్త్రీచేతిలో అసలు డబ్బే నిలవదంటారు. నిలవాలంటె ఆమెలో ఎన్నో మంచిగుణాలు వుండాలి. భాగ్యవంతుల భారతమ్మ కాస్త చేయి విదిలింపుమనిషి. సరదాల కేం లోటు లేదు. ఆమెలో కోర్కెలు బలీయమైనాయి. మనఃపథంలో తిరగాటం మొదలుపెట్టాయి. కామవాంఛ రేకెత్తింది. ఆవాంఛకు గురియై సర్వస్వం నాశనంచేసికొంది. ఆమె దృష్టిలో అది కామవాంఛ కావచ్చు. కాని జన సామాన్యందృష్టిలో అది కామవాంఛకాదు—కామపిశాచికి గురియైంది. ఆ పిశాచం స్వేచ్ఛగా విహారం సాగించింది కన్నుమిన్ను కానక ప్రవర్తించింది. ఇల్లు వళ్ళు గుల్ల యింది. క్రమంగా వళ్ళు హునం హునం అయింది.

స్త్రీకి చపలచిత్తం జాస్తే. ఒక్క ఆలోచన కూడా సరైనదని నిర్ణయంచేసికోలేదు. మన భారతమ్మకూడా అదే రకం. భారతమ్మ గట్టి పట్టుదలమనిషి. ఒక నిర్ణయానికి వచ్చిం దంటే యింక తిరుగులేదు. కాని ఆ రావటమే కష్టం.

ఊళ్ళోవున్న భాగ్యవంతుల జాబితాలో ఆమె ఒకతె. మంచీ సుక్షేత్రమైన మాగాని భూమి వుంది. పెద్దలు కష్టించి ఆర్జించిన సొమ్ము అదిఅంతా. దాని విలువ ఈమెకేం తెలుస్తుంది. చేతిలో ఉన్నన్నాళ్ళు పుష్కలంగా ఖర్చుచెయ్యటం తప్ప.

ఇష్టమొచ్చినట్లు తిరిగిందేమో నేడు చీపురు చేతికొచ్చింది. పాచిపనిచేయటానికి మనిషి లేదు. అంట్లుతోమటానికి అంతకంటె లేదు. ఉదయం చీపురు పుచ్చుకొని ప్రారంభించి రాత్రి పడుకోపోయే పర్యంతం యిల్లంతా స్వయంగానే చక్కపెట్టుకోవాలి. ఖర్మంకాకపోతే మరేమిటి! ఒకప్పుడు భోగభాగ్యాలలో తులతూగి నేడు చీపురుపుచ్చుకొని నడుము వంచి వీధివాకిలి ఊడ్చవలసివచ్చింది దీనికి కారణం ఆమెచేజేతులా చేసికొన్న మహాపరాధమే. మన్మధుని వాడిబాణాలకు గురియై బాగుపడ్డవారెవ్వరులేరు. ఆమెకు ఆ కోర్కె కలగటమేమిటి? కలిగినా క్రిందాపైనా కానకుండా ప్రవర్తించటమేమిటి ? కామపిశాచికి లొంగిపోవటమే ?

అందుకే ఆ కాయకష్టం. నేడు మనకు భాగ్యంపోయిన భారతమ్మ చీపురుకట్టతో వీధిలో ప్రత్యక్షమైంది.

*   *   *

అర్ధరాత్రి సమయం వెన్నెలలు కాస్తున్నాయి. ప్రతినిమిషం ఏమరుపాటులేకుండా పట్టణవాతావరణాన్ని గుర్తుచేస్తున్నాయి రిక్షా బండ్లు గలగలలాడించుకొంటూ. ఆ పట్టణం లోని ఒక సందులోని యింట్లో ముగ్గురు వ్యక్తులు నిద్రిస్తున్నారు.

తలుపు గడియ తొలగించబడింది. బయటికి నడుస్తున్నాడు. రెండవవ్యక్తి కళ్ళుతెరచాడు. బయటికిపోతున్న వ్యక్తిని చూచాడు. తలుపులు దగ్గరగా చేర్చుతున్నాడు బయటి నుండి.

"పాపారావుగారూ! తలుపు గొళ్ళెంపెట్టకండి! నేను ప్యాసుకు బైటకువెళ్ళాలి."

"అలాగే" అని తలుపులు రెండు కలిపి దగ్గరగా లాగి వెళ్లిపోయాడు.

తర్వాత ఒక పదినిమిషాలకు రెండవ వ్యక్తి కోటయ్య నెమ్మదిగా తలుపులుతీసి బైటకెళ్ళాడు. నాలుగుప్రక్కలా కలియచూచాడు పాపారావుకోసం. మళ్లి తిరిగివచ్చి పడుకున్నాడు.

ప్రక్కగదిలోనుండి ఎత్తుగానున్న కిటికీ గుండా వెలుతురు ప్రసరిస్తోంది. సన్నగా మాటలసవ్వడివినవస్తోంది. లేచాడు కోటయ్య, కిటికీ కాస్త ఎత్తుగావుంది. మూలనున్న ఎత్తుపీట కిటికీదగ్గరచేర్చి దానిమీద నిలబడ్డాడు. బెదురుగా లోపలికి తొంగిచూచాడు. షుమారు ఒక ఐదు నిమిషాలు నిలబడివుంటాడు. ఇక నిలబడబుద్ధిపుట్టలేదు. పీటను దూరంగా యథాస్థానంలో పెట్టి కళ్లుమూసుకొనిపడుకొన్నాడు. ఎంతసేపటికిని నిద్రరావటంలేదు. మాటిమాటికి గొంతువరకు వస్తోంది ప్రక్కనున్నవాడ్ని లేపుమని. పేరుపెట్టి తట్టబోయి అప్రయత్నంగా ఆగిపోతున్నాడు. ఆ వ్యక్తి నిశ్చింతగా నిద్రిస్తున్నాడు. గత్యంతరంలేక యిప్పుడుకాదులే అని సరిపెట్టుకొని గట్టిగా కళ్ళుమూసికొని నిద్రించడానికి ప్రయత్నిస్తున్నాడు కోటయ్య. ఆలోచనలను దూరంగా తరుముతున్నాడు కలతనిద్రపట్టింది.

తెల్లవారింది. మొఖాలుకడిగి కాఫీసేవించటానికి హొటల్‌లో జొరబడ్డారు. కోటయ్య. కోదండం, రెండు ప్లేట్ల సాంబారుయిడ్లీ ఆర్డరిచ్చాడు కోటయ్య చెదరిన మనస్సుతో. కోదండం హుషారుగా వున్నాడు అవుసుమరి ఆయనకేం తెలుసు అసలు విషయం !

"ఏం బావ! అట్లా నీరసంగా వున్నావే?" అని సూటిగా ప్రశ్నించాడు కోదండం. "సరిగా రాత్రి నిద్రలేక" అని అదోవిధంగా మొగం పెట్టి అన్నాడు కోటయ్య అసలు విషయం చెపుదామా వద్దా అని ఆలోచిస్తూ.

చివరకు నిశ్చయానికివచ్చినట్లు తలాడిస్తూ "కోదండం! నీ కొక విషయం చెపుతాను!"

"ఏమిటది?" నిర్లక్ష్యంగా అడిగాడు ఇడ్లీని సాంబారులో ముంచుతూ.

"ఇప్పుడు కాదు! రాత్రికి"

"ఏమిటి బావా ఆ దాపరికం!"

"ఏమి లేదంటినిగా! రాత్రికి తప్పకుండా చెపుతాగా!" అని యిడ్లీలో జొరబడ్డాడు.

కోదండం ఆలోచనలో పడ్డాడు యిడ్లీ ముక్క గొంతులోవేసికొని, కాఫీకూడ సేవించి బిల్లు సమర్పించుకొని బైటికొచ్చారు. ఒక గోల్డుఫ్లేక్‌సిగరెట్టుపెట్టుకొని బావకోటి అందిచ్చాడు కోదండం. దమ్ముపీలుస్తూ బజారు వెంట నడక సాగించారు.

ఆ రోజంతా ఎవరిపనుల్లోవారు లీనమైనారు. కోదండం ఆలోచననుండి విముక్తి పొందలేకపోయాడు. విషయం పూర్తిగా తెలిసినా, తెలియకపోయినా బాధ అంటూ ఏమి వుండదు. గుంజాటనే కలుగదు. ఏమిటో ఉన్నదిలే అని ఆ ఉన్నదేమిటో చెప్పకుండా సందిగ్ధంలోపెడితే వాడి అవస్థ ఇక వర్ణించటం బహుదుర్లభం. ఎదుటివాడ్ని ముంచదలచుకుంటే పూర్తిగాచెప్పి నిండా ముంచాలి. లేకపోతే ఆ ప్రసక్తి తేకూడదు. అప్పుడు ఎవరికి ఏ బాధ వుండదు.


కోదండంపని పొద్దునపడ్డచేపయ్యింది. గిలగిలలాడిపోతున్నాడు. అడుగువామంటే రాత్రిదాకా గడువుపెట్టాడాయె బావ. బావమాట అంటే తిరుగులేదు. ఒకపట్టాన చెప్పేరకం కాదు. సాగదీసినా సవాశేరు ఆముదం ఖర్చే కాని, ఆయన ఏమాత్రం సాగేమనిషి కాదు. చివరకు నిరాశతో రాత్రికై ఎదురుచూడ సాగాడు.

పగలల్లా ఎండలో బాగా తిరిగాడేమో రాత్రి చప్పున పడుకున్నాడు. బాగా గుర్రు పెట్టి నిద్రపోతున్నాడు.

ఆ గదిలో ముగ్గురు మూడు ప్రక్కల నేలపై పరుపులు పర్చుకొని పడుకున్నారు. కోటయ్య రోజు అక్కడ ఉండేవాడుకాడు. ఉండటంమాత్రం ఆ వూరులోనే. కోదండంతో పనివుండివచ్చి కోదండం బలవంతం చేస్తే మూడు రోజులబట్టి యిక్కడే పడుకొంటున్నాడు. అందులో నిన్నరాత్రి ఒక రహస్యవిషయాన్ని పరిశోధించాడు.

రాత్రిలాగే పాపారావు లేచి తలుపుగడియ తీశాడు. కోటయ్య ఆ క్షణంకోసం ఎదురు చూస్తూనేవున్నాడు. వెంటనే "పాపారావుగారు!





తలుపు వెయ్యకండి బయటికి వెళ్ళాలి" అని ముక్తసరిగా అడిగాడు. "అలాగే" అని తలుపులు దగ్గరచేర్చాడు పాపారావు రాత్రి తన రహస్యం బయటపడలేదనే ధీమాతో. అందుకే ఏమాత్రం ఆలోచించకుండా సంకోచించకుండా 'ఆలాగే' అని సమాధానమిచ్చాడు యధేచ్ఛగా వెళ్లిపోయాడు.

కోటయ్య పిల్లిలాగా లేచాడు పది నిమిషాలతర్వాత వీధిలోకి వెళ్ళివచ్చాడు. కళ్ళు తెరచుకొని పక్కమీద బోర్లా పడుకొన్నాడు. సన్నగా స్వరాలు వినవస్తున్నాయి. రూఢిగ నిర్ధారణచేసికొని పీటవగ్గరచేర్చి కిటికీలో తల దూర్చాడు. సరిగా రాత్రితనకళ్లతో ఏంచూశాడో అదే ఈరోజు జరుగుతోంది. ఎక్కువసేపు నిలబడక వెళ్ళి నెమ్మదిగా తట్టిలేపాడు కోదండంని. ఉలిక్కిపడ్డాడు. వెంటనే సంబాళించుకొని కోటయ్యను అనుసరించాడు. ఆ పీటమీద నాలుగుకాళ్లుపెట్టే యిరువులేక పోతే చెరొక కాలుపెట్టి నిలబడ్డారు. కోదండం మొదటచూచి నిర్ఘాంతపోయాడు తనుచూస్తున్నది కలకాదు గదా! అనే అనుమానం వేసింది. కళ్లు గట్టిగా నలుపుకొన్నాడు. తుండుతో కళ్లు తుడుచుకొన్నాడు. ఏమిటి తను చూస్తున్నది యధార్థమేనా? వాస్తవిక జగత్తులోని సంఘటనేనా? ఇది నా భ్రమ కాదు గదా! అని పరిపరి విధాల ఆలోచించాడు. కాదుకాదని అంతరాత్మ ఘోషించింది.

బెడ్‌లైట్ మూన్‌లాంప్‌కాంతిలో ఆ గది అంతా స్పష్టంగా కనబడుచున్నది. నవారు పట్టిమంచంమీద చక్కటి పాన్పుమీద పాపారావు వడిలో భారతమ్మ తియ్యటికలలు కంటోంది. పాపారావు భారతమ్మ హృదయానికి హత్తుకొంటున్నాడు. ఇద్దరిపెదవులు కలిసికొన్నాయి. ఆమె మొగమంతా చుంబనంతో నింపివైచాడు. పయ్యెదజారిపోయింది. నగ్న శరీరం కొట్టవచ్చినట్లుగా స్ఫుటంగా కనిపిస్తోంది.

ఇక చూడలేకపోయాడు కోదండం. కోపముతో మొగమంతా వివర్ణమైంది. పళ్ళుపటపట కొరుకుతూ ఒక్కసారిగా పీటమీదనుండి రెండడుగులలో వాకిలిచేరబోయాడు. వెంటనే కోటయ్య అనుసరించాడు. తలుపుతెరుస్తున్న కోదండంను చేయిపట్టుకొని లాక్కువచ్చి పరుపుమీద కూర్చోపెట్టాడు.

"కోదండం! తొందరపడకు" అని శాంతింప చేయటానికి ప్రయత్నిస్తున్నాడు కోటయ్య.

"బావా! యింకా తొందర వద్దంటావా?"

"కోదండం! కాస్త స్వరం తగ్గించు. ఇది సమయంకాదు. ఓర్పు అవసరం యిటువంటి విషయాలలో!"

"ఏమో! నేనిక సహించలేను. ఈ కిరాత ఘాతుకచర్య. ఈ రహస్య ప్రేమకలాపాలు ఎంతకాలంగా సాగుతున్నాయో? వీటికి నేటితో స్వస్తిచెప్పాలి!"

"అది ఒకనాటి సంఘటనకాదు వెంటనే స్వస్తిచెప్పటానికి. దానికి కొంతకాలం అవసరం. ఒక్కసారిగా ఇదమిద్ధమని తెలిసి అడుగు ముందుకువేసి తర్వాత సంజాటనలో పడితే ప్రయోజనం వుండదు. ముందే అన్ని జాగ్రత్తలు వహించటం శ్రేయస్కరం!"

"అట్లాఅని చేతులు ముడుచుకొని కూర్చోమంటావా?" కాస్త కటువుగానే అన్నాడు కోదండం.

"అది నా అభిప్రాయంకాదు! దానికి ఇది మాత్రం సమయం కాదని నీకు గుర్తుచేస్తున్నాను."

"ఎప్పుడు ఆ సమయం?"

"ముందుంది! నెమ్మదిగా తీక్షణంగా సూక్ష్మంగా ఈ విషయాన్ని శ్రద్ధగా పరిశీలించి ఒక నిర్ణయానికి రా! అంతవరకు వేచివుండు. పొరపాటునకూడా తొందరపడి మాట జారవద్దు!"

"అయితే నా కళ్లతో చూస్తూ సహించమంటావా?"

"ఈరోజే కదా నీ దృష్టిలో పడింది. నిన్నరాత్రే నే నీ దృశ్యాన్ని చూచాను. అప్పుడే నీ చెవినవేద్దామని ప్రయత్నించికూడా విరమించుకొన్నాను. ఈవిషయంమీద తీవ్రంగా ఆలోచించు!"

"ఎన్నిరోజులనుండి జరుగుచున్నదో ఈ కాముకచర్య?"

"కోదండం! నేడుకదా తెలిసికొంది. ఇంత కాలం వూహించికూడా నీవు ఉండలేదుకదా! ఎన్నిరోజులనుండి జరుగుతున్నా మనం ఈ క్షణంలో చేసేదేమీ లేదు. ఈ విషయాన్ని నీకే వదలివేస్తున్నాను. బాగా ఆలోచించు ప్రస్తుతానికి విశ్రమించు!"

ఆ గ్రామానికి పట్టణానికి ఎక్కువ దూరం లేనందున ఎప్పుడు అటు ఇటు తిరుగుతూనే వుంటారు. భారతమ్మకూడ అక్కడాయిక్కడా వుంటూవుంది. కోదండం రోజు అక్కడికి ఇక్కడికి పచార్లు చేస్తుంటాడు.

ఒకవారం రోజులనుండి భారతమ్మ స్వగృహంలోనే కాలక్షేపం చేస్తున్నది. కోదండం ఎక్కువగా ఆ గ్రామంలోనే వుంటున్నాడు. ఈ గడచిన వారం రోజులలో ఆ ప్రసక్తే లేదు కోదండం. భారతమ్మకు ఈవిషయంమీద కోదండంకు అనుమానమున్నదని ఎట్లా అనుకొంటుంది. ఇంతవరకు ఏనాడు లేనిది ఆమె ఇదివరకటిలాగే తిరుగుతోంది. కోదండం మాత్రం కుంపటిలోని వంకాయలాగా కుతకుతలాడుతున్నాడు. ఏ నిమిషాన బుస్సుమంటాడో తెలియదు. ఇంతవరకు ఆ ప్రసక్తే వచ్చే అవకాశం కలుగలేదు. ప్రసక్తి తేవలిసిన అవసరం భారతమ్మకు లేదు, ఎటొచ్చి కోదండం పని అది.

కోదండం ప్రతివిషయానికి చుర్రుబుర్రుమంటున్నాడు. ఏ విషయం అడిగినా విదిలించుకొని తిరుగుతున్నాడు. భోజనంకూడా వేళకు కడుపునిండా తింటున్నట్లు కనపడటంలేదు!

సాయంత్రం కాఫీవేళ అయింది! భారతమ్మ ఒక గ్లాసుకాఫీ తల్లి రంగమ్మకు అందించింది. ఇంతలో బయటనుండి కోదండం వచ్చి కుర్చీలో కూర్చున్నాడు కాళ్ళకున్న చెప్పులుకూడా విప్పకుండా! అక్కడే ఎదురుగా మంచంమీద కూర్చొనివుంది భారతమ్మ!

"నీ ప్రవర్తన నాకేమి నచ్చలేదు" తల దించుకొని అన్నాడు ఏమాత్రం తొణక్కుండా! "ఏం ప్రవర్తన?" అంది!

"ఈమధ్య నీ ప్రవర్తనలో మార్పు నాకేం నచ్చటంలేదు!"

"ఇన్నాళ్లనుండి లేనిది ఈరోజు వచ్చింది! క్రొత్తగా వచ్చింది ఏమీ లేదు?"

"ఒక్కసారి గట్టిగా ఆలోచించి చూడు నీకే తెలుస్తుంది!"

"ఏమిటి ఆలోచించేది! నీవేమైన భ్రమపడుతున్నావా?"

"భ్రమకాదు! వాస్తవమే! నీ కాముక చర్యనుగురించి హెచ్చరిస్తున్నాను! అది ఏ మాత్రం మంచిదికాదు!"

"ఏమిటా మాటలు!"

"మాటలుకాదు! కళ్ళారా చూచినవిషయం వారంరోజులక్రిందట నీ చర్య అంతా బట్టబయలైంది!"

"పారబడివుంటావు!"

"నేనా ? ఇంకా కళ్ళుకప్పటానికి ప్రయత్నించకు! నీవు పాపారావుతో జరిపే రహస్య కలాపాలన్నీ కళ్ళారా చూచాను! అది నీకు శ్రేయస్కరం కాదు ! వెంటనే నీబుద్ధి మార్చుకో !

"సలహా యిస్తున్నావా?"

"సలహా కాదు ! వాత్సల్యంతో హెచ్చరిక చేస్తున్నాను!"

"అది నీకు అనవసరం!"

"అని నీవు తలుస్తున్నావా ? దానితో నాకు అవసరంవుంది. వంశమర్యాదను పాటించు! కులభ్రష్టతను పొందకు! జరిగిందేదో జరిగింది! ఇకనైనా మేల్కోటం మంచిది."

"ఆ విషయాలన్నీ నాకు తెలుసు! ఆపాటి జ్ఞానం నాకు వుంది!"

"ఉండేనా కామవికారానికి లోనై విద్రోహ చర్యలు తలపెట్టావు!"

"కాస్త జాగ్రతగా మాటలు రానీ!"

కోదండం అవమానంతో క్రుంగిపోయాడు! వళ్లంతా కంపిస్తోంది! కోపంతో తల యటు త్రిప్పుకొన్నాడు. వెంటనే చటుక్కున కాలి జోడువిప్పి పెళ్ళున ఒక్కటిపెట్టాడు.

భారతమ్మచెంప కందిపోయింది! బూరె ముక్కలా వాచి చెంపన చెయ్యిపెట్టుకొని, "మూర్ఖుడా! ఎంతపనిచేశావు! చేరదీసినందుకు చక్కటి బహుమానాన్ని బహూకరించావు. ఇక నీ మొగం చూడను ఫో! అవతలకు" అంది వీధివైపు చేయిచూపిస్తూ.

"పోతున్నాను! తిరిగి నీవు కావాలని కోరుకున్ననాడే దర్శనమిస్తాను! నీచేతి మంచినీళ్లు కూడా త్రాగను. ఏనాడు నీకు కనువిప్పు కలుగుతుందో బహుశా ఆనాడే కలియిక! మంచిది వెళ్ళుతున్నాను!" అని గిరుక్కున జోడు తొడుక్కుని వీధిగుమ్మంవైపు వెళ్లిపోయాడు. ముసలిరంగమ్మ విస్తుపోయింది. భారతమ్మ వెనకనే వెళ్లి వీధివాకిలి మూసి వచ్చింది. అప్పటికే యిరుగు పొరుగు జనం గుమిగూడారు. గుసగుసలు ప్రారంభమైనాయి. తలాఒక ఆలోచన సాగించారు. పల్లెటూరుకావడంతో వెంట వెంటనే అంచెల వారీగా పాకిపోయింది.

* * *

చెడి అత్తగారింటికి చేరాడు కోదండం ! ఎక్కువగా చెపుతుంటారు ! చెడి పుట్టింటికి చేరకూడదని స్త్రలవిషయంలో. పుట్టింట్లో అందరు చులకనగా చూస్తారు. వదినగార్లు ఆడబడుచులు ఆడిపోసికొంటారు. కాని యిక్కడ మన విషయం అల్లుడు చేరాడు అత్తింటికి.

కోదండంకు పెండ్లిఅయి నాలుగు సంవత్సరాలైంది. అత్తిల్లు - పుట్టిల్లు అన్నీ అ వూరే. చదువు ఎక్కువగా వంటబట్టలేదు అబ్బాయి గారికి. లోకజ్ఞానంమాత్రం బాగా సంపాదించాడు.

అత్తింట్లో అందలం ఎక్కికూర్చున్నట్లుంది కోదండం పని. మేడమీదవున్న ఒక్కగది అల్లుడికి వసతిగృహంగా యిచ్చారు. భోజనానికి, మిగిలిన కాలకృత్యాలకు క్రిందికి దిగివస్తాడు.

ఏమరుపాటులేకుండా అన్నిసదుపాయాలు కొత్తఅల్లుడికి చేసినట్లు చేస్తున్నారు. అసలే అల్లుడిమనస్సు చెదిరివుంది, ఇంకా ఎక్కడ చెడుతుందో అన్న భయం కూడా వారిలో వుందేమో ! అడగకుండానే సమకూరిపోతున్నాయి కావలసిన వన్నీ.

గోల్డుఫ్లేక్ సిగరెట్ వెలిగించి ఆ బ్యాటరీ రేడియోముందు అస్తమానం కూర్చుంటాడు. మధ్యమధ్య వచ్చిన స్నేహబృందంతో పేకముక్కలు పరుస్తాడు. వేళకు మామగారితో భోజనంచేస్తాడు క్రిందకు దిగివెళ్లి. కాఫీ వగైరా అంతా పైకే వస్తుంది. రోజు చిట్టిమరదలు పిలుపుతోనో, బావమరది పిలుపుతోనో బయలుదేరుతాడు. అత్తగారిచేతి భోజనం కడుపార భోంచేసి ఆయాసంతో ఎక్కలేక ఎక్కివస్తాడు మేడమెట్లు. వచ్చి అమాంతంగా అట్లా మంచంమీద పడిపోతాడు. కళ్లు అప్రయత్నంగా సిగరెట్ప్యాకెట్కై వెదుకుతాయి. చేతులు అటువైపు పరుగెడుతాయి! ఒకదమ్ము లాగితేగాని తృప్తి వుండదు.

భోజనసమయంలో మామగారితో ఏదో మాటమీద మాటవస్తునేవుంటుంది. మామగారు అంత పట్టించుకొనేవాడుకాదు. అల్లుడి తత్వం బాగా ఆకళింపుచేసికొన్నాడు.

ఒకసారి భారతమ్మ విషయంలో మామగారు సలహా ఒకటి సూచించబోయారు. నీవు చేసింది తప్పని అన్నారు. ఆమాటకు మండిపడ్డాడు కోదండం. ఇంకాస్తవుంటే అన్నం ముందునుంచి లేచి వెళ్లేవాడేమో కూడా? తమాయించుకొని కూర్చున్నాడు. ఆరోజుకు నంజిలేచివెళ్లాడు. తిరిగి మామగారు ఎన్నడు ఆ ప్రసక్తి తేనేలేదు.

ఎండలు తీవ్రంగా కాస్తున్నయి. సాయంత్రమయినా వడగాలి తగ్గలేదు. కోదండం స్నానంచేసి కాఫీ సేవించి గదిముందు వాలు కుర్చీలో కూర్చున్నాడు. సిగరేటు వెలిగించి పొగను చక్రాలలాగ త్రిప్పుతున్నాడు.

(పై సంచికలో ముగింపు)

# కను విప్పు

రచన: విశ్వాత్ముల




భారతమ్మభర్త నాగయ్యాగారు మంచి స్థితిమంతుడు ఆస్తినంతా చక్కగా కూడబెట్టి కాపాడాడు. వారిద్దరి వయస్సులో దాదాపు పదిహేను సంవత్సరాల వారావుంది. పిల్లలుమాత్రంలేరు. భారతమ్మ నాగయ్యాగారి రెండవభార్య. తమ్ముడుకొడుకు కోదండం ఐదవ ఏటినుండి నాగయ్యాగారింట్లో ఎక్కువ వుంటూవుండేవాడు.

భారతమ్మకు ముప్పది ఐదు సంవత్సరాలప్పుడు నాగయ్య పరమపదించినాడు. ఒక్క నలుసునన్న ప్రసాదించకుండనే! కోదండానికి భారతమ్మ వివాహంచేసింది. ఇప్పుడు కోదండం ఇరువది యేండ్లు. సుక్షేత్రమైన మాగాని భూమి పది ఎకరాలు కోదండంపేర వ్రాసి యిచ్చింది. ఇప్పుడు ఉన్నయింట్లో ప్రక్క భాగంకూడా రాసియిచ్చింది.

కోదండం చిన్ననాటినుండి చదువుకు దూరంగావుండేవాడు. ఏమాత్రం అబ్బలేదు. తర్డుఫారం ప్యాసయినాడేమో! మిగతాకాలం వృధాగా గడిపాడు.

కోదండం స్నేహితుడు పాపారావుతో కలిసి వ్యాపారం ఆ పట్టణంలో పెట్టాడు. దాంట్లో యెక్కువవంతు కోదండమే భరించాడు. లాభాలలో చెరిసాగం.

కోదండంకోసం ఎక్కువుగా యింటికివస్తూ పోతూవుండటమువల్లా పాపారావుతో భారతమ్మకు పరిచయం యేర్పడింది.

పాపారావుతో కలిగిన పరిచయం స్నేహంగా మారింది. స్నేహం ప్రేమగామారి వాంఛలను రేకెత్తించింది. ఆమెలోని కామవాంఛ ఆమెను వేధించసాగింది. మనోనేత్రం మూసుకుపోయింది. కామవాంఛ బలీయమై పరవళ్లు త్రొక్కసాగింది. యవ్వనపు పొంగు ఇంకా చల్లారనేలేదు. ఆమె పుష్టికలిగిన అంగసౌష్టవం పురుషస్పర్శను సదా వాంఛిస్తోంది. పాపారావును చూచినపుడల్లా ఆమె వళ్ళు పులకరిస్తుంది. మనస్సు ఉప్పొంగిపోతుంది. హృదయం ఆనందడోలికలలో తేలియాడుతుంది.

పాపారావు మొదట్లో సంకోచించాడు. భారతమ్మకు దూరంగా తిరగసాగాడు. భారతమ్మ వాలుచూపులు, అంగసౌష్టవం పాపారావును ముగ్ధుడ్నిచేసేవి. కాని కోదండం ఏమంటాడో ఈవిషయం తెలిస్తే అని బాధపడుతుండేవాడు.

ఒకరోజున అనుకోకుండనే వద్దనుకుంటూనే పాపారావు భారతమ్మవడిలో వాలిపోయాడు. తన భయాన్ని భారతమ్మకు చెప్పాడు. ఆమె పాపారావుకు చేయూత యిచ్చింది. కోదండం యీ విషయంలో జోక్యం కల్పించుకొనకుండా తను చూసుకొంటానంది. నిశ్చింతగా మెలగసాగాడు పాపారావు.

కోదండంభార్య యింకా కాపురానికిరాలేదు. కోదండం ఆ పట్టణంలో వ్యాపారంపెట్టి ఒంటరిగావుండి హొటలుభోజనం చేయటం భారతమ్మకు యిష్టంలేదు. ఆమె వండిపెట్టటానికి వెళ్లింది. చుట్టాలదృష్టిలో భారతమ్మ కోదండంకు వండిపెట్టటానికి వెళ్లిందని. ప్రజల దృష్టిలో కోదండంతోపాటు పాపారావుక్కూడా వండిపెడుతోందని. అది అంతా వాస్తవమే.

పల్లెటూరులో ఏ రహస్యమైనా దాగటం కష్టం. బస్తీలో ఎవరు ఎట్లాయేడ్చినా పట్టించుకొనేవారు అరుదు. ఎవరింటో ఏం కాల్చుకున్నా ఎవరు పట్టించుకోరు. ప్రక్కభాగంలో అద్దెకున్నవారు ఎవ్వరోకూడా తెలియదంటె ఆశ్చర్యమేమిలేదు. ఒకరిసంగతి మాకెందుకు అని సరిపెట్టుకుంటారు.

భారతమ్మ పైరెండు కారణాలతోపాటు మూడవది తనది జోడించింది. బస్తీలో తను స్వేచ్ఛగా తిరుగవచ్చు. తన కార్యక్రమానికి అడ్డంకులు వుండవు. అన్ని ఆలోచించే ఈ పనిచేసింది. పాపం! కోదండాని కేం తెలుసు ఈ విషయమంతా. నిజంగా తనకు వండిపెట్టటానికి వచ్చిందని సంతోషించాడు.

పాపారావు తెలివితేటలుగలవాడు. న్యాక్‌గా పనిఅంతా కోదండంమీదకుతోసి ప్రక్కకు తప్పుకుంటూ వుండేవాడు. ఎక్కువ వాటావున్న కోదండం చిరునవ్వుతో స్వీకరించేవాడు. ఏమాత్రం కొద్ది సమయం దొరికినా పాపారావు భారతమ్మతో బాతాఖానీకొట్టేవాడు. అమెకూడా విసుగులేక వేదాక్షరాలులాగా తల అడిస్తు వూకొట్టేది.

ఇంతకాలంగా రహస్యంగా జరుగుతున్న ఈ సంఘటన కాస్త కోటయ్య వెల్లడిచేశాడు. కోటయ్యకు పాపారావు అంటే సుతరాము గిట్టదు. అందుకు కారణం పాపారావు వక్రబుద్దే. ఇంత సంఘటన జరిగినప్పటికి పాపారావుకు చీమ కుట్టినట్లుగాకూడా లేదు.

*　　　*　　　*

కోదండం పాపారావుతో తెగతెంపులు చేసికొన్నాడు. పెట్టినదాంట్లో నాలుగో వంతు వచ్చిందేమో! దానితోనే తృప్తిపడ్డాడు అల్పసంతోషి కోదండం. పది ఎకరాలమీద వస్తున్న దాంతో అత్తవారింట్లో కులాసాగా కాలక్షేపం చేస్తున్నాడు.

పెండ్లయి నాలుగు సంవత్సరాలయింది. శోభనంఅయికూడా దగ్గరదగ్గర ఏడాది కావస్తున్నది. భారతమ్మతో వేరుపడి అత్తింటికి చేరి భార్య లక్ష్మితో కాపురం మొదలెట్టాడు. నెలతప్పిందని యింటిలో అనుకొంటున్నారు. చిట్టిమరదలు పుణ్యమా అంటూ ఆ వార్త చేరింది కోదండానికి. భార్యకు సిగ్గేసిందేమో చెప్పలేదు. తర్వాత కోదండమే బుజ్జగించి ఆమె నోటివెంట తెలిసికొన్నాడు.

తను తండ్రికాబోతూన్నరోజులు దగ్గరపడుతున్నాయి! ఏడాదినుండి మామగారింట్లోనే మకాం. ఖర్చుఅంతా వారిదే. తను యిస్తానన్నా పుచ్చుకోరు. వేరే కాపురంపెట్టాలని నిశ్చయించుకొన్నాడు కోదండం.

ఈ విషయం మామగారితో ప్రస్తావించాడు. "తొందరేమొచ్చింది. ఎట్లాగు మొదటిప్పరుడు

మేము పోయవల్సిందెగా! అది కాస్త పూర్తి అయినతర్వాతే వెళుదురుగాని" అని అన్నారు మామగారు.

"నేను వేరే కాపురంపెట్టేది యింకెక్కడో కాదు, ఈ వూరులోనే నా యింట్లోనే. కాబట్టి మీ అమ్మాయి ఎప్పుడుపడితే అప్పుడు వచ్చి వెళ్ళుతూ వుండవచ్చు!" అని నచ్చచెప్పాడు కోదండం.

"భారతమ్మ నడిగావా అయిల్లు యిప్పుడు నీపఠంచేస్తుందేమో?"

"లేదండి!....ఆ విషయం పెద్దలు మీకు వదిలేస్తున్నాను. మీరే ఆపనికాస్తతెమల్చండి!"

మామగారిని భారతమ్మవద్దకు రాయబారం పంపాడు యింటివిషయంలో. ఏమంటుందో అని అనుకున్నాడు. విప్పారిన ముఖంతో తిరిగివస్తున్న మామగారి వాలకం చూసి పండెనని తలంచాడు. తను తలంచిన విషయం నిజమని మామగారు నిర్ధారణచేశారు. వేరింటి కాపురం విషయం భార్యతోచెప్పి ఎగిరిగంతేశాడు కోదండం.

కోదండంభార్య లక్ష్మిమాత్రం కించిత్తు బాధపడింది. ఇక యింటిచాకిరి తనే చేసికోవాలి. ఒంటరి జీవితం. మాటాడించేవారే వుండరు. ప్రక్కనున్న భారతమ్మ ఏం సూటిపోటి మాటలు అంటుందో యివన్నీ తట్టుకోటం కష్టం. తను యింతవరకు అమ్మను వదిలి ఎక్కడికి పోలేదాయె!

కూతుళ్లను కాపురానికి పంపించాలంటే తల్లులకు కళ్ళవెంట నీళ్ళు గిర్రున తిరుగుతాయి. అవి వాత్సల్యపూరితమైన బాష్పాలు మాత్రమే. ఇంతకాలం పెంచి ఒక్కసారిగా ఎడబాటు సహించటం అనేసరికి ఎవరికైనా బాధగానే వుంటుంది. ప్రాణస్నేహితుడు దూరంగా వెళ్లితేనే నాలుగు రోజులవరకు వెలితిగా వుంటుందే అటువంటప్పుడు రక్తం పంచుకుని పుట్టినపట్టిని పరులగడపకు పంపేటప్పుడు వారికి ఎంత కష్టమో చెప్పలేము,

కోదండం సంతోషానికి అంతులేదు. క్రొత్త యింటికి సున్నంకొట్టించాడు. శుభముహూర్తంలో యింట్లో గృహప్రవేశం అయినాడు.

ఆ క్రొత్తయింట్లో నవ దంపతులు లాగా కాలంగడుపుతున్నారు. పనిమనుములున్నారు యింటెడి చాకిరికి. ఎటొచ్చి ఒక బిందెడు మడినీళ్ళుపట్టుకొని వంటచేయటం — అదే కష్టమనిపించింది కోదండం భార్య లక్ష్మికి ఒంటరిజీవితంవల్ల.

లక్ష్మికి భారతమ్మ క్రొత్తయేమికాదు. చిన్ననాటినుండి వస్తూపోతూవుండేది. భారతమ్మతో కోదండం అయితే ప్రతినపట్టాడు కాని భార్య లక్ష్మికికూడా అది వర్తింపచేయలేదు. ఆమె యిష్టమని ఊరుకున్నాడు.

భారతమ్మకు వేరేవిధమైన కుళ్ళుబుద్ధి ఏమిలేదు. తను ఒక్కటే చెడింది. ఇంక యెవ్వరిని నాశనంచెయ్యలేదు చేయటానికి ప్రయత్నాలుకూడా సలుపలేదు. భారతమ్మకు కోదండం అంటె అయిష్టమే అయినా లక్ష్మిని ఆదరించేది.

లక్ష్మి యిద్దరిమధ్య — ఇటు భర్త అటు భారతమ్మతో జాగ్రత్తగా మెలిగేది. భర్త కను సైగలలో మెలగంటం నేర్చుకొంది.

కోదండం భారతమ్మ ఊసే ఎత్తేవాడు కాడు. ఏమయినాసరే అని చేతులు కడుకొన్నాడు. తన వ్యవహారమేమిటో తన పనియేమిటో అంతే. సాయంత్రం ఆటుగుళ్ళోకి వెళ్లి బ్యాడ్‌మింటన్ ఆడేవాడు.

లక్ష్మి మధ్యమధ్య సాయంత్రంపూట అమ్మగారింటికి వెళ్ళి దీపాలుపెట్టేవేళకు తిరిగి వస్తుండేది. ప్రస్తుతానికి తనకు తోడుగావుండటానికి చెల్లెలిని తీసుకువచ్చింది. చిల్లరపనులన్నీ చెల్లెలే చేస్తుంది

వ్యాపారములేనందున కోదండం కాలక్షేపానికి వూరులోని పెద్దలతో చీట్లాడేవాడు డబ్బులు పెట్టే. వచ్చినరోజు వస్తుంటాయి. వచ్చిన మొత్తం చిన్నదేకాని పోయే మొత్తం పెద్దదే.

లక్ష్మికి చూచాయగా తెలిసింది. భర్తను ప్రేమతో వద్దని కోరింది. చివరకు కోపంతో హెచ్చరించింది. కోదండం పెడచెవినపెట్టాడు అసలు వినిపించుకోలేదు.

పనిపాటాలేకుండా కూర్చుని తింటుంటే ఎంతవస్తేమాత్రం నిలుస్తుంది. దానికితోడు ఈ అభ్యాసాలుకూడ కొన్ని. దీనికి డబ్బుతో పనుండిగా! రజ్జయిన ఆటలలో ఒకటి మొదలుపెట్టితే వదలిపెట్టబుద్ధిపుట్టదు. బుద్ధిపుట్టినా స్నేహబృందం వదలదుగా! అనేక సార్లు వదిలించుకోటానికి ప్రయత్నించి విఫలుడైనాడు,

ప్రసవించేరోజులు దగ్గరపడ్డాయి. మామగారి పిలుపుతో భార్యతోసహా అత్తింటికి చేరాడు కోదండం ఒక్కడేవుండి స్వయంపాకంచేసికొని తినలేడు మామగారు రమ్మనగానే కిమ్మనకుండా వెళ్లికూర్చున్నాడు,

భార్య దగ్గర లేనప్పుడు తనకు తృప్తినిచ్చేది, అహ్లాదాన్ని కలిగించేది ధూపమే. చిట్టిమరదలు ఆయాసంతో రొప్పుతూ మేడ మెట్లు ఎక్కిరావడం చూచాడు కోదండం. మరదలంటే కాస్త భయం. భయం అంటే ద్వేషంతో కూడినదికాదు వాత్సల్యంతోకూడిన భయం. సీమటపాకాయిలాగా ఏంచేస్తుందోనని.

"బావ! నెగ్గాను పందెం యిచ్చేయి!"

పుస్తకపఠనంలో వున్నాడు. వెంటనే బయటపడలేకపోయాడు.

"బావా! నిన్నే"

"ఏమిటి?" పుస్తకంప్రక్కనపెట్టిఅడిగాడు.

"నెగ్గాను పందెం! ఆడపిల్లే పుట్టింది. పది రూపాయలు యిచ్చుకోండి"

"నిజంగానా?"

"అబద్ధం ఎందుకు ఆడతాను?"

"పది రూపాయలకోసం ఆడకూడదా?"

"నీలాగా కాదులే బావా! నిజమే త్వరగా యివ్వు!"

"తీసికో ఏంచేస్తాం" అంటూ చొక్కాజేబులోంచి పది రూపాయిల కాగితం యిచ్చాడు. హుషారుగా చిందులేసికొంటూ మేడదిగివెళ్లి పోయింది.

పితృస్థానంలోని ఆనందాన్ని కలలుకంటున్నాడు. అత్తగారు ఒకసారి భోజనాలదగ్గర అల్లుడ్ని హెచ్చరించింది. "ఏమయ్యోయ్! అల్లుడా! ఇక మూటకట్టాచు. ఖర్చుచేయక అసలే యివి కట్నాలరోజులు!"

చిరునవ్వునవ్వివూరుకున్నాడు. "అట్లాగే" అన్నట్లు తల ఆడించాడు. కోదండం రోజులు లెక్కపెడుతున్నాడు. అనుకున్నరోజు రానే వచ్చింది. ఇల్లంతా హడావిడిగావుంది.

అయిదవ నెల వచ్చింది. భార్యను వెంట పెట్టుకొని చిన్నారి ముద్దులపట్టిని చంకనెత్తుకొని ప్రయాణమైనాడు తన యింటికి. "జాగ్రత్త! పాప!" అంటూ అత్త వెనుక నుండి హెచ్చరికచేస్తున్నది.

* * *

భారతమ్మకువున్న అడ్డంకు కాస్త తొలగిపోయింది. ముసలితల్లి నోరెత్తదు. ఎత్తితే గతేమిటో తెలుసు. కోదండం పోయినతర్వాత రస్తారహదారి అయింది. ఇప్పుడు భారతమ్మ కోరితే పాపారావువచ్చి యింట్లో కాకిలాగా వాలుతాడు చేతిలో ఆటబొమ్మ. అంతమాత్రం చేత పాపారావును తేలికగా ఎందుకు పనికి రానివాడని తీసివేయకండి! ముందు ఆలోచించే వ్యక్తి. భారతమ్మ వడిలో వూరికే పడలా! బంగారుపిచ్చుకను చేజిక్కించుకోటానికే.

భారతమ్మ వుండటం పల్లె కాని ఎక్కువ కాలం గడిపేది పట్టణంలోనే. భారతమ్మ నలబయ్యోపడిలో పడినా ఆమె షోకులు, చర్యలు, వాంఛలు ఏమాత్రం సన్నగిల్లలేదు. పల్లెలో వున్నప్పుడు యింట్లోనుండి బయటకు రాదు. పట్టణంకెడితే అక్కడ మొదలుపెడుతుంది వేషం. తలకు వలదగ్గర్నుంచి కాళ్లకు స్లిప్పర్సువరకు. జారిపోయే జార్జెట్‌సిల్కు చీరెలు, వళ్ళు సగం కనిపిస్తూ రెవికలు, గోళ్లకు రంగులు యిత్యాదులన్ని వుంటాయి.

పాపారావు ఒక పిల్లజమీందారులాగా వెలిగిపోతాడు. సిల్కులాల్చీలు, గ్లాస్కోధోవతులు, సెంటువాసనలు గుప్పసకోడుతూ అపరమన్మధునిలా తయారౌతాడు. అస్థితినిలో పాపారావునుచూస్తే భారతమ్మ స్వర్గంలో వున్నట్టే

భావిస్తుంది. పాపారావుతో స్వర్గసౌఖ్యాలు అనందించే సమయమిదేనని తీయని ఊహలు కంటుంది. వారి కాముకచర్యకు చెలియలి కట్టవుందా? వుంటుందా అనిపిస్తుంది.

* * *

ఈ ఐదు సంవత్సరాలలో కోదండం సంసార సాగరంలో మూడు సర్టిఫికెట్లుపుచ్చుకొన్నాడు. వియ్యానికి, కయ్యానికి సరిపోయేటట్లుగా. పిల్లలు పెరిగి పెద్దవాళ్ళవుతున్నారు. భారతమ్మకు కోదండం అంటే గిట్టదు కాని అతని పిల్లలంటే మహా ప్రీతి. వాళ్లని దగ్గరకుతీస్తూ వుంటుంది. కోదండం భార్యచెపితే విని వూరుకునేవాడు.

లక్ష్మికి బాగా పనివున్నప్పుడు పిల్లలను భారతమ్మదగ్గర దిగవిడచేది. పిల్లలను దగ్గరకు తీసి సాకుతుండేది.

భారతమ్మ బయటవున్న మూడు రోజులు లక్ష్మి అన్నం వండిపెట్టేది. ముసలిరంగమ్మ గారు పొయ్యిదగ్గర కూర్చోలేదు. కోదండంకు వేరే వండిపెట్టేది. వేళకు కాఫీకాచి యిస్తుండేది.

"అదిగో యిస్తున్నావే? ఎందుకు యిస్తున్నావు" అని కోదండం ఏనాడు లక్ష్మిని అనలేదు. అనవలసిన అవుసరంకూడ కలుగలేదు. విడిపడింది తను భారతమ్మ కాబట్టి వైరం వారిద్దరికే.

పిల్లలు బామ్మదగ్గరకు వెళ్లేవాళ్లు. మనుమళ్లు, మనుమరాళ్లు వచ్చారని తినుబండారాలు పెడుతుండేది భారతమ్మ. భారతమ్మ లేనిరోజున గొంతులో మందుపోసేది లక్ష్మి. ఉపచారాలుచేసేది మంచందగ్గర కూర్చొని, పచ్చంపానం జాగ్రతగా చూస్తుండేది.

ఎటొచ్చి లక్ష్మి ముట్టయిన మూడు రోజులే యిబ్బందిగా వుండేది కోదండంకు, కోదండం వంటచేయటం నేర్చుకోలేదు. అంత యవసరం కూడా కలుగలేదు.

కోదండం యింట్లో వున్నప్పుడు భారతమ్మ ఆ యింట్లో అడుగుపెట్టదు. లేనప్పుడు వచ్చి కూర్చొని లక్ష్మితో మాట్లాడుతుంది. భారతమ్మ కోదండంమధ్య రాయబారిగా మెలుగుతోంది లక్ష్మి.

భారతమ్మను కనీసం కన్నెత్తికూడా చూచే వాడుకాదు కోదండం. ఇక చేతివంట అంటే ఏమాత్రం తింటాడో మనకే అర్థమవుతుంది. ఆ మూడు రోజులు పెద్దకూతురు చేతులు కాల్చుకునేది.

ప్రతిది బయటికివచ్చి లక్ష్మిని అడిగి చెప్పించుకొని లోపలికివెళ్ళి ఆ ప్రకారం చేసేది. కోదండం అట్లాగే యాతనపడి ఆ నాలుగుమెతుకులు గొంతులో వేసికొనేవాడు. లక్ష్మి బయటనున్న మూడురోజులు కోదండం ప్రాణం మూడు గండాలను గడిచి గట్టెక్కినట్టే.

అది పస్తుతహా ప్రకృతి వారికి ప్రసాదించిన అపూర్వవరం. అది ఎవరు కాదనటానికి వీలు లేదు. చక్కటి విశ్రాంతి సమయం.

ఇదేముంది మూడురోజులే. అసలు పెద్ద సెలవు వేరేవుంది. కాన్పుకు మూడు నెలలు ముందు — అయిదు నెలలు తర్వాతే తిరిగి ఉద్యోగంలో ప్రవేశించటం. అంతకాలం ఒంటరిజీవితం! అబ్బ ఎంత దుర్భరమో!

కాని తనకు అంతగా అనిపించలేదు. తను కూడా భార్యతో వెళ్లేవాడు. అందువలన సతీమణి ముఖారవిందం రోజు గోచరించేది. చూచి సంతోషించేవాడు. ఎడబాటుకు తావు లేకపోయేది.

పెద్దవాళ్లవుతున్నారు. పగలుకూడా మీతో నేను సరసాలాడితే పిల్లలు వినరూ. వారు చెడిపోతారు. వారికీ విషయమే తెలియకూడదు. అందుకే కదండి యిప్పుడు తీరుబడిగా మీ దగ్గరకొచ్చాను. ఇక మీ యిష్టం! అంత అయిష్టమయితే వెళ్తాను!"

"ఎక్కడికి?"

"నా చిన్నారి పాపలదగ్గరకు!"

"వద్దులే!" అని కొంగుపట్టుకొని దగ్గర చేర్చి కరిగిపోతాడు కోదండం.

"మీరెంత మంచివారండీ!" అని లక్ష్మి అంటుంటే కోదండం మూర్ఛపోతాడు.



కోదండం అప్పుడప్పుడు అనుకొంటూవుండేవాడు. మాతృస్థానంవహిస్తే భర్తమీద మమకారంపోతుంది. అస్తమానం పిల్లలగోడే కాని భర్తవైపు చూపుకూడా పారవేయదు ఏమన్నా గట్టిగా అంటే పిలవాడు యేడుస్తున్నాడు నిద్ర పుచ్చేవరకు ఈవేళ అయింది. మరి నన్నేం చేయమంటారు" అని రుసరుస లాడుతారు. ఇక పిల్లలపోషణే వారి పరమావధి.

రాత్రికి కోదండం అలిగిపడుకునేవాడు. పిల్లల్ని నిద్రపుచ్చి భర్తదగ్గరకు చేరేది లక్ష్మి. చిన్నబుచ్చుకున్న వదనంతో అవతలి వైపు తిరిగి పడుకునేవాడు — కదిలిస్తే విదిలించుకునేవాడు.

"ఎందుకండీ! అంత కోపం?"

"కోపమేముంది! ప్రొద్దుటనుండి చూస్తున్నాను. ఇప్పుడు నీకు కన్పించానన్నమాట"

"ఏమండీ! మీరే చెప్పండి. పిల్లలు పెరిగి

పాపారావు చక్కటి పథకం ఒకటివేశాడు. అమలు జరపటానికి ప్రయత్నాలు సల్పుతున్నాడు.

భారతమ్మ అంగసౌష్టవంలోని బిగువు ఏమాత్రం సడలలేదు. ఆమె కోర్కె అరని దాహంలావుంది. ఈ ప్రయాణాలకు పంటల మీద వచ్చే సంవత్సరాదాయం చాలటంలేదు. పది ఎకరాలభూమి భారతమ్మకు వుంది ఆ యిల్లుకాక, కోదండానికి యిచ్చింది పోను.

పాపారావు శరీరస్థితి పాడైంది. ఇంటిదగ్గర భార్య విలపిస్తోంది. ఒక కొడుకును ప్రసాదించాడు ఆమెకు. భార్యమాట మరిచిపోలేదు గాని దూరంగానే వుంటున్నాడు.

మన ప్రాచీనులు అందుకే వివాహవిషయంలో తగు కట్టుదిట్టాలుచేశారు. స్త్రీకన్న పురుషుడి వయస్సు ఎక్కువ వుండాలని నిర్ణయించారు. అప్పుడే పురుషుడు స్త్రీని సంతోష

పెట్టగలుగుతాడు. స్త్రీని తృప్తిపరచటం చాలా కష్టం.

భారతమ్మకంటె పాపారావు చాలా చిన్న. భారతమ్మధాటికి పాపారావు తట్టుకోలేక పోయాడు. శరీరం పాడైంది. అయినా పాపారావు విరమించుకోలేదు. అది ఒకనాడు చెడినదికాదు. క్రమంగా యిన్ని సంవత్సరాలబట్టి చెడుతూవస్తోంది.

పాపారావు భారతమ్మచేతి విలాసవస్తువని కొందరి అభిప్రాయం. భారతమ్మ పాపారావు ఆటవస్తువని కొందరి అభిప్రాయం రెండు నిజమే కావచ్చు. ఒకరిచేతులో ఒకరు యిరుక్కుపోయారు.

యువక పాపారావు ముసలిపాపడైనాడు. కళ్ళు లోతుకు పీక్కుపోయాయి. మనిషి ఎండుకుపోతున్నాడు. నరముల బలహీనత యేర్పడింది.

కావలసిన చికిత్సలన్నీ చేయించుకుంటున్నాడు. మంచిమంచి విలువకల్గిన మందులు పుచ్చుకొంటున్నాడు. పుష్టినిచ్చే ఆహారం తీసికొంటున్నాడు.

కోదండం వ్యాపారంలోనుండి వైదొలగినా పూర్తిగా తీసివేయక నామక జరిపిస్తున్నాడు పాపారావు. పాపారావుకు లాభాలు ఎక్కడా లేవు. ఎదో కాలం వెళ్లబుచ్చుతున్నాడు వ్యాపారం అని పేరుపెట్టి............భారతమ్మ సలహా అనుసరించే! ఎత్తేస్తే ఎట్లా? ఆటపెట్టం కట్టదు.

భారతమ్మకు హుషారుకోసం పాపారావు ఒక డోసుపోసేవాడు. త్రాగి మత్తుగా మైకంలో పడిపోయేది. పాపారావును ఆ మైకంలో కౌగలించుకొనేది. పాపారావు చల్లగా తనకు కావలసినవన్నీ చెవులో ఏకరువుపెట్టేవాడు. మైకములో సరే అని ఒప్పుకునేది.

తర్వాతకూడా పాపారావు దీనంగా ముగం పెట్టి భారతమ్మముందు నిలబడేవాడు. ఆమెకి అర్థమయ్యేది ఎందుకు అట్లా నిలబడ్డాడో కావలసిన డబ్బు యిచ్చిపంపేది.

వచ్చే ఆవాయం పోను రెండు ఎకరాల వరకు అప్పుఅయింది. అవి డిశంబరురోజులు డబ్బుకు కటకటలాడే రోజులు. పాపారావు మంచిప్లానువేశాడు.

"భారీ! వ్యాపారం దెబ్బతినేట్లుగా వుంది పైకం అవసరం!"

"పాప! నాదగ్గిర కానీలేదు యిప్పుడు మరి నన్నేం చేయమంటావ్?" అంతటితో వూరుకొన్నాడు. ఆరోజురాత్రి దగ్గరకుతీశాడు. కౌగిలిలో బంధించి "భారీ! డబ్బులేకపోతే పోయె! మర్చిపోయా నీదగ్గిర బంగారంసొమ్ము లున్నాయిగా ప్రస్తుతానికి యివ్వు బ్యాంకులో పెట్టి డబ్బుతెచ్చి వాడుకుంటాను."

"సరే నీకంటెనా పాప!" అంది ఆ వాంఛా ప్రపంచంలో.

దాదాపు నాలుగు వేల దాకా ఖరీదుచేసే గజ్జలవడ్డాణం, చంద్రహారం తీసియిచ్చింది.

పాపారావు డబ్బుకక్కుర్తికి ఆ పని చేయలేదుగా! భారతమ్మను ముంచాలని ప్రయత్నమాయె. తను ఎట్లాగో శరీరనష్టం పొందాడు. కానీ కనీసం తన యింటిలోని వారన్న బాగుపడద్దూ యీ దెబ్బతో.

మరునాటినుండి పాపారావు భార్యమెడలో చంద్రహారం నడుమున వడ్డాణంతో ప్రత్యక్షం కులుకుతూ తిరుగసాగింది.

ఎక్కడ వచ్చేడబ్బు చాలటంలేదు భారతమ్మకు. నగలు విడిపించుకొని రమ్మని ఆయేడు పంటతాలూకూ డబ్బు యిచ్చింది పాపారావుకు. చిన్నకొంటెసాకుతో ఆ డబ్బు దిగమింగాడు. మావిడకు అపరేషన్‌కు ఖర్చు అయిపోయింది యేమి అనుకోకు.

ఇంకేమి అనుకుంటుంది. ఆ యేడు తిండికి అప్పు తెచ్చుకున్నది. వడ్డీ పెరిగిపోయింది. మొత్తముమీద ఎటుతిరిగివచ్చిన అప్పులు నాలుగు ఎకరాలదాక అయింది. ఆస్తి అంతా కరిగిపోతోంది. బంగారం చేయి దాటిపోయింది.

పాపారావు భారతమ్మకు నచ్చచెప్పాడు. ఒక ఆరు ఏకరాలు తనపేర వ్రాయమని అప్పులు తీర్చుతానని ఇంత కష్టపడ్డందుకు అందులో రెండు ఎకరాలు తనకు.

పది ఎకరాలలోనుండి ఆరు ఎకరాలు ఒక్కసారిగా పోవటమంటే భారతమ్మకు కష్టమేసింది. ససేమిరాకాదు కూడదంది. పాపారావు మండిపడ్డాడు. భారతమ్మ విదిలించుకుంది.

భారతమ్మను కౌగిలిమత్తులోనింపి రిజిష్టరు చేయించుకొన్నాడు పాపారావు. ఆవిషయము తర్వాత బైటపడింది. భారతమ్మ పాపారావును బ్రతిమాలింది. పాపారావు వినిపించుకోలేదు.

భారతమ్మ పాపారావును లోలోపల అసహ్యించుకోటం మొదలుపెట్టింది. పైకివచ్చినప్పుడు సేవతీర్చి ఆరు ఎకరాల సంగతి ముచ్చటించేది. తగ్గట్టుగా పాపారావు అభినయించి అక్కడనుండి తప్పుకొనేవాడు.

భారతమ్మలో నిరాశపెరిగిపోయింది. ఇంక ఆ ఆరు ఎకరాలకు తర్పణం వదిలింది. ఈ సంఘటన జరిగిన ఏడాది జరగకముందే పాపారావు పరలోకయాత్ర వెళ్ళాడు.

భారతమ్మ నిలువునా నీరైంది. పాపారావు పోయినందుకు కాదు, ఆస్తిఅంతా నాశనమయినందుకు.

ఆస్తిపోయింది! అప్పులు మాత్రం తనకై ఎదురుచూస్తున్నాయి. మిగిలిన ఆస్తికి సరిపోతయి ఆ అప్పులు. అట్లాగే కాలంతీస్తున్నది.

పెద్దతనం దగ్గరపడుతున్నది. మనస్సులోని మాలిన్యము తొలగిపోయింది. భాగ్యం నశించేటప్పటికి మనోనేత్రం తెరువబడింది. నిజానిజాలు గ్రహించింది లోకజ్ఞానం ఆర్జించింది.

యవ్వనపు పొంగుతోపాటు శరీరంలోని సత్తువకూడ నీరసించింది. పాతచరిత్ర కళ్లకు వచ్చినప్పుడల్లా విలపిస్తుంటుంది. అంతకంటే ఆమె చేయకలిగింది యేమీలేదు.

వేళకు తల్లికి ఉడకేసిపెట్టి తనింతతిని ఆ మంచంమీద పడుకుంటుంది. ఎప్పుడు ఏదో ఆలోచనలతో మధ్యమధ్య కళ్లవెంట నీరుకారుస్తుంది. అమె నేడు చేయగలిగింది అది ఒక్కటే!

భాగ్యం నశించింది. దాసదాసీజనం వెళ్ళిపోయారు. అందుకే నేడు చీపురుపట్టుకొని వీధివాకిలి వూడుస్తోంది. ఇంటెడు చాకిరీ స్వయంగానే చేసికొంటోంది.

భారతమ్మకు మనోవికారం కలిగింది. కోదండం చెప్పినమాటలు చెవులలో ఇప్పుడు కర్ణపుటాలను భేదించుకొంటూ తిరుగుతున్నాయి. భాగ్యలక్ష్మిచే బైర్లుకమ్మినకండ్లు, కామవాంఛచే సుళ్ళుతిరిగే మనస్సు అనాడు కోదండంమాటలు దగ్గరచేరనివ్వలేదు. తెర తొలగిపోయింది! పొర వీడిపోయింది! మాటలలోని అంతరార్థం గ్రహించింది.

కోదండంతప్ప తనకు చేయూతనిచ్చేవారు ఎవరు లేరు. లక్ష్మి సరేనరి అన్నివేళలా సేవ చేస్తుంది. కోదండం తనను ఆదరిస్తాడా? ఏమో!

కాని చిన్ననాటి వాత్సల్యం ఎక్కడికి పోతుంది. మధ్యలో అన్నవి పట్టించుకొని కూర్చున్నా నేనే వెళ్ళి అడుగుతాను. ఎంత చెడ్డా తల్లినేకదా! అమాత్రం గౌరవించడా!

భారతమ్మ మనస్సు పూర్తిగా చలించింది! కోదండంనుగురించి ఆలోచిస్తున్నది. కోదండంకు మిగిలిన ఆస్తినంతా ఒప్పచెప్పి అప్పులు తీర్చమని చెపుదామని గట్టిగా నిర్ధారించుకొంది. లక్ష్మిచేతిభోజనంచేసి "శివశివ" అనుకుంటూ కాలంవెళ్లబుచ్చాలని నిశ్చయించుకొంది.

కళ్లనీళ్లతో గతాన్ని దూరంచేసికొని, ప్రస్తుతాన్ని కల్పనచేసికొంటున్నది. ఏది ఏమైనప్పటికి........నేటికి కలిగింది........భారతమ్మకు కనువిప్పు!!! (అయిపోయింది)

★